సాక్షి
నిర్మల్
సోమవారం । 19 । జూన్ । 2023





## 'జేఈఈ అడ్వాన్స్‌డ్'లో మెరిసిన విద్యార్థులు

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. వీరిని పలువురు అభినందించారు. IIలో▸



## మంత్రి అల్లోల ఇంటికి పీఠాధిపతి

నిర్మల్‌టౌన్: రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఆహ్వానం మేరకు కంచి కామకోటి మఠం పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతిస్వామి ఆదివారం నిర్మల్‌లోని మంత్రి నివాసానికి వచ్చారు. మంత్రి దంపతులకు ఆశీస్సులు అందించారు.

## వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
40.0 /29.0

మధ్యాహ్నం ఎండ తీవ్రత కొనసాగుతుంది. వేడిగాలులు వీస్తాయి. ఉక్కపోత అధికంగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది.

## న్యూస్‌రీల్

### 'పుడమి పులకించేలా మొక్కలు నాటాలి'

నిర్మల్‌టౌన్: గ్రామాలు, పట్టణాల్లో పుడమి పులకించేలా.. ప్రకృతి పరవశించేలా అధికసంఖ్యలో మొక్కలు నాటాలని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సూచించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. హరితహారం ప్రజల భాగస్వామ్యంతో సత్ఫలితాలనిస్తోందని చెప్పారు. ఇదే స్ఫూర్తితో తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించే హరితోత్సవం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవతం చేయాలని కోరారు. అలాగే అటవీశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో పచ్చదనం పెరగడానికి చేసిన కృషి, వాటి ఫలితాల గురించి ప్రజలకు వివరించాలని మంత్రి సూచించారు.

### బాసర ఆలయంలో భక్తుల రద్దీ

భైంసాటౌన్: బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఉదయం నుంచే భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. గోదావరినదిలో పుణ్యస్నానాలాచరించారు. అనంతరం క్యూలైన్లలో నిల్చుని అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి, మొక్కు తీర్చుకున్నారు. చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు.

కుంటాల: స్థానిక గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కు తీర్చుకున్నారు.

### 'ఒత్తిడిని జయిస్తేనే విజయం'



మాట్లాడుతున్న దేవి మురళి

భైంసాటౌన్: విద్యార్థులు పరీక్షలంటే భయం వీడాలని, ఒత్తిడిని జయిస్తేనే విజయం సాధిస్తామని జిల్లా బాలల సంరక్షణ అధికారి దేవి మురళి పేర్కొన్నారు. జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం బాసర ఆర్జీయూకేటీలో పీయూసీ-1 విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్షల సమయంలో ఆందోళన చెందకుండా, ప్రణాళికబద్ధంగా చదివితే ఉత్తీర్ణత సాధించవచ్చని సూచించారు. కార్యక్రమంలో లీగల్ అధికారి నరేందర్, సోషల్ వర్కర్ కరుణశ్రీ, ఆర్జీయూకేటీ అధ్యాపకులు, విద్యార్థులున్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్ రూరల్: జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న 60 ఉపాధ్యాయ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని డీఈవో రవీందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఈనెల 26 నుంచి జూలై 5వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్హతలు, రాత పరీక్ష విధానం, సిలబస్, అభ్యర్థుల ఎంపిక విధానం తదితర వివరాలకు పాఠశాల విద్యాశాఖ https://schooledu.telanga na.gov.inను సంప్రదించాలని సూచించారు.

### గౌడ కులస్తులకూ రూ.లక్ష సాయమందించాలి



రవికుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: బీసీ కులవృత్తుల వారికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రూ.లక్ష సాయం గౌడ కులస్తులకూ ఇవ్వాలని గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర కమిటీ చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని మోకుదెబ్బ జాతీయ కార్యాలయంలో గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అన్ని కులాలకు అభివృద్ధి పథకాలు, నిధులు కేటాయించి గౌడ కుల వృత్తిదారులు మృతి చెందితే ప్రమాద బీమా ఇస్తామనడం సిగ్గు చేటన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులను అన్ని రంగాల్లో అభివృద్ధికి దూరం చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రూ.లక్ష సాయం గౌడ కులస్తులతో పాటు అన్ని బీసీ కులాలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గద్దె దింపుతామని హెచ్చరించారు. అనంతరం గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్‌ను కలిశారు. గీత కార్మికులు, గౌడ కులస్తుల కోసం గీత కార్పొరేషన్‌కు రూ.5వేల కోట్లు కేటాయించి కల్లు గీత వృత్తిని అభివృద్ధి చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అతడిని సన్మానించారు. రాష్ట్ర నాయకులు పచ్చిమడ్ల స్వామిగౌడ్, మోత్కూరి సంజీవ్‌గౌడ్, కొండగొని రవీందర్‌గౌడ్, అమరవేణి భరత్‌గౌడ్, మేరుగు కృష్ణగౌడ్, బుడిగే గురువయ్య గౌడ్, మోకుదెబ్బ నాయకులున్నారు.

# క్యూఆర్‌తో నకిలీకి చెక్..!




విత్తన ప్యాకెట్‌పై ముద్రించిన క్యూఆర్ కోడ్

- విత్తన ప్యాకెట్లపై ప్రత్యేక కోడ్
- తప్పనిసరి చేసిన ప్రభుత్వాలు
- ప్రస్తుత సీజన్ నుంచే అమలు
- నకిలీకి అడ్డుకట్ట పడే ఛాన్స్

నిర్మల్‌చైన్‌గేట్: విత్తన ప్యాకెట్లపై క్యూఆర్ కోడ్ ఉంటే అసలువేవో.. నకిలీవేవో సులువుగా గుర్తించవచ్చు. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విత్తన ప్యాకెట్లపై క్యూఆర్ కోడ్ తప్పనిసరిగా ముద్రించాలని సీడ్ కంపెనీలకు ఆదేశాలు జారీ చేశాయి. ఈ మేరకు మార్కెట్‌లో రైతులకు విక్రయించే పత్తి విత్తన ప్యాకెట్లపై క్యూఆర్ కోడ్ తప్పనిసరిగా ముద్రించాలని విత్తన కంపెనీలకు కేంద్రం సూచించింది. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో సాగు చేసే పత్తి, మొక్కజొన్న విత్తనాలకు ప్రైవేట్ కంపెనీలే దిక్కు. ఈ నేపథ్యంలో అమాయక రైతులకు నకిలీ, నాసిరకం విత్తనాలు కట్టబెట్టేందుకు కొంతమంది వ్యాపారులు సిద్ధమయ్యారు. దీన్ని అరికట్టేందుకు క్యూఆర్ కోడ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించడం రైతులకు ఊరట కలిగించే అంశం.

### 3.60 లక్షల ఎకరాల్లో సాగు

జిల్లాలో చాలామంది వ్యవసాయం మీదే ఆధారపడి జీవిస్తున్నారు. జిల్లాలోని 18 మండలాల్లో వానాకాలంలో 3.60లక్షల ఎకరాల్లో రైతులు సాగు చేస్తారు. ఇందులో ఎక్కువశాతం పత్తి, మొక్కజొన్న వేస్తారు. సీజన్ ప్రారంభమవుతున్న క్రమంలో పలు రకాల కంపెనీలు తమ విత్తనాలను మార్కెట్‌లోకి విడుదల చేశాయి. ఇందులో ఏవి నకిలీవో?.. ఏవి అసలువో? తెలియని పరిస్థితి నెలకొంది. కంపెనీలు అమ్మే విత్తనాల్లోనే ఒక్కోసారి నాసిరకం వస్తున్నాయని, దీంతో ఆశించిన స్థాయిలో దిగుబడి రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నాసిరకం విత్తనాలతో రైతులు నష్టపోయిన సందర్భంలో పలు కారణాలు చెప్పి పరిహారం ఇవ్వడం లేదు. దీంతో నకిలీ విత్తనంతో పాటు నాసిరకం విత్తనాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం విత్తనాల ప్యాకెట్లపై క్యూఆర్ కోడ్ తప్పని సరిచేసింది.

### క్యూఆర్ కోడ్‌తో ప్రయోజనాలు

రైతులు పత్తి విత్తన డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి రశీదు పొందినప్పటికీ ఆ విత్తనాలు మొలకెత్తకపోయినా, పంట నష్టపోయినా గతంలో విత్తన కంపెనీల నుంచి సరైన పరిహారం అందేది కాదు. కొందరు బ్రాండెడ్ కంపెనీల లేబుళ్ల అతికించి రైతులను మోసం చేసేవారు. కానీ.. ప్రస్తుతం క్యూఆర్ కోడ్ ముద్రించడంతో ఆ విత్తనాలు మొలకెత్తకున్నా.. దిగుబడి సక్రమంగా రాకున్నా.. ఆ విత్తన కంపెనీ నుంచి పరిహారం పొందవచ్చు. వ్యవసాయ అధికారులకు క్యూఆర్ కోడ్ ఉన్న ప్యాకెట్‌ను చూపిస్తే విత్తనం సమగ్ర సమాచారం వస్తుంది. దాని ఆధారంగా కంపెనీ నుంచి పరిహారం అందుతుంది. అయితే రైతులు కొనుగోలు చేసిన పత్తి విత్తనాల ప్యాకెట్, రశీదులను భద్రపర్చుకోవాలి.

### తప్పకుండా రశీదు తీసుకోవాలి



విత్తన ప్యాకెట్లపై కొన్ని కంపెనీలకు క్యూఆర్ కోడ్‌లు ఉన్నాయి. మరికొన్నింటికీ లేవు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న విత్తనాల ప్యాకెట్లకు క్యూఆర్ కోడ్ ఉంటుంది. దీంతో రైతులు నష్టపోయే ప్రమాదం ఉండదు. విత్తనాలు కొనుగోలు చేసిన తర్వాత తప్పకుండా రశీదు తీసుకుని భద్రపర్చుకోవాలి.

– నాగరాజు, ఏవో

### పూర్తి సమాచారం

కంపెనీలు విక్రయించే విత్తన ప్యాకెట్లపై విత్తనాల లాట్ సంఖ్య.. ఎక్కడ పండించారు.. వంగడం రకం పేరు.. ఎక్కడ శుద్ధి చేశారు.. వాటి సాగు కాలపరిమితి.. విత్తనాన్ని సర్టిఫైడ్ చేసిన సంస్థ పేరు.. చిరునామా, జన్యుపరమైన వివరాలు.. క్యూఆర్ కోడ్‌లో ఉంటాయి. మార్కెట్‌లో పత్తి, మొక్కజొన్న, వరి విత్తనాల విక్రయం ఎక్కువగా ఉంటుంది. అయితే అసలు విత్తనాల కన్నా ముందే.. నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి వచ్చేశాయి. నకిలీ విత్తన సంచులపై లేబుల్ నంబర్.. లాట్ నంబర్.. విత్తనాలను పరీక్షించిన తేదీ.. ప్యాకింగ్ తేదీ.. వ్యాలిడిటీ.. ఎమ్మార్పీ ఇవేవీ ఉండవు. కొన్ని కంపెనీలు బోగస్ లేబుల్ వేసి నాసిరకం విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సమస్యను అధిగమించేందుకు క్యూఆర్ కోడ్ తప్పనిసరి చేసినట్లు తెలుస్తోంది. గతేడాది ప్రభుత్వ రంగ సంస్థలు విక్రయించే విత్తనాలపై క్యూఆర్ కోడ్‌లు ముద్రించగా, ఈ సీజన్ నుంచి ప్రైవేట్ కంపెనీలు కూడా ప్యాకెట్లపై కోడ్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నాయి. కొన్ని పేరు పొందిన కంపెనీలు మాత్రమే క్యూఆర్ కోడ్‌లు ముద్రించి విత్తనాలు విక్రయిస్తున్నా, కొన్ని కంపెనీలు కోడ్ లేకుండానే విక్రయిస్తున్నాయి.

# గుడ్డుపై.. స్టాంప్



ప్రభుత్వం సరఫరా చేసిన ముద్రతో ఉన్న కోడి గుడ్లు

- పౌష్టికాహారంపై ప్రత్యేక 'ముద్ర'
- అంగన్‌వాడీ కేంద్రాలకు లోగోతో సరఫరా
- పక్కదారి పట్టకుండా పకడ్బందీ చర్యలు

కోటపల్లి/పెంచికల్‌పేట్: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారంలో భాగంగా ప్రభుత్వం కోడిగుడ్లను అందజేస్తున్న విషయం తెలిసిందే. అయితే కొందరు వీటిని పక్కదారి పట్టిస్తున్నారు. కొన్నిచోట్ల సరఫరాదారులు కుళ్లిన, చిన్న పరిమాణం కలిగిన గుడ్లు సరఫరా చేస్తున్నారనే విమర్శలున్నాయి. ఈ క్రమంలో సమగ్ర శిశు సంక్షేమ శాఖ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. అక్రమాలను నియంత్రించేందుకు కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. లబ్ధిదారులకు మాత్రమే అందించేలా పకడ్బందీ చర్యలు షురూ చేసింది. కోడిగుడ్లపై 'అంగన్‌వాడీ గుడ్లు.. తెలంగాణ ప్రభుత్వం' అని ప్రత్యేక ముద్ర వేసి పంపిణీ చేస్తోంది.

### పక్కదారి పట్టకుండా..

ఆరోగ్యలక్ష్మి పథకంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరే మూడేళ్లలోపు చిన్నారులకు ప్రభుత్వం బాలామృతం, గుడ్లను అందజేస్తోంది. అలాగే ఆరేళ్లలోపు పిల్లలకు గుడ్లు, పప్పు, కూరగాయలు, భోజనం, కుర్‌కురే, పల్లిపట్టి వంటివి ప్రతీరోజు అందేలా చూస్తోంది. బరువు తక్కువగా, బలహీనంగా ఉన్న వారికి రెట్టింపు పౌష్టికాహారం కూడా అందజేస్తోంది. అంగన్‌వాడీ కేద్రాలకు వచ్చే వారికి రోజుకు ఒకటి చొప్పున గుడ్డు ఉడికించి ఇస్తున్నారు. వివిధ కారణాలతో అందుబాటులో లేక ఎవరైనా కేంద్రాలకు రాకపోతే వారికి అందజేసినట్లు రికార్డుల్లో రాసుకొని దారి మళ్లిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇకపై ఎలాంటి అవకతవకలు జరగకుండా విడతల వారీగా ఒక్కో రంగుతో ముద్ర వేస్తున్నారు.

### మూడు రంగుల్లో..

జూలై నుంచి ఫిబ్రవరి వరకు నెలకు రెండు విడతలుగా గుడ్లు అందిస్తారు. మార్చి నుంచి జూన్ వరకు వేసవిలో గుడ్లు త్వరగా పాడైపోయే ప్రమాదం ఉండటంతో నెలకు మూడు దఫాలుగా సరఫరా చేస్తారు. వేసవిలో అందించే గుడ్లపై నీలం, ఎరుపు, ఆకుపచ్చ రంగులు, చలికాలం, వర్షాకాలం అందించే గుడ్లపై ఎరుపు, ఆకుపచ్చ రంగులను ముద్రిస్తారు. ముద్ర మధ్యలో అంగన్‌వాడీ కేంద్రం ఏ జోన్ పరిధిలోకి వస్తుందో ఆ జోన్ నంబర్లను కూడా స్పష్టంగా కనిపించేలా 5 మిల్లీమీటర్ల పొడవు, వెడల్పుతో ముద్రిస్తున్నారు. ప్రత్యేకమైన ముద్ర వేసిన ఈ గుడ్లనే ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

### ట్రాకింగ్ సిస్టం ద్వారా సరఫరా

అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేసే గుడ్లు పక్కదారి పట్టకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కమోడిటీ సప్లయ్ ట్రాకింగ్ అనే ప్రత్యేక విధానం ద్వారా బ్యాచ్‌ల వారీగా సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ ముద్ర ఉన్న కోడిగుడ్లను కొనుగోలు చేసేందుకు వ్యాపారులు, ఇతరులు భయపడతారని, గుడ్ల అక్రమ రవాణా, వినియోగాన్ని ప్రాథమిక దశలోనే కట్టడి చేయొచ్చని, తద్వారా అసలైన లబ్ధిదారులకు మాత్రమే గుడ్లు అందజేసే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

### పారదర్శకంగా పంపిణీ..

పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రత్యేకంగా ముద్ర వేసి సరఫరా చేస్తున్న గుడ్లనే లబ్ధిదారులకు అందిస్తున్నాం. బ్యాచ్ నంబర్ ఉన్న నేపథ్యంలో లబ్ధిదారులకు అందించడం కూడా సులువు అవుతుంది.

– హసీనా, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, పెంచికల్‌పేట్

### పక్కాగా పౌష్టికాహారం..

అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు సంపూర్ణ ఆరోగ్యం కోసం నెలనెలా కోడిగుడ్లు పంపిణీ చేస్తున్నాం. సరఫరాలో అక్రమాలు లేకుండా పంపిణీ చేసేందుకు మూడు రంగుల్లో ముద్ర వేస్తున్నాం. దీంతో లబ్ధిదారులకు పక్కాగా పౌష్టికాహారం అందుతుంది.

– మనోరమ, సీడీపీవో, చెన్నూర్

### ఉమ్మడి జిల్లాలో 4వేల కేంద్రాలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4 వేలకుపైగా అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. వీటిలో 19,144 మంది గర్భిణులు ఉన్నారు. 19,779 మంది బాలింతలు, 1,95,043 మంది చిన్నారులు నమోదై ఉన్నారు. వీరందరికీ నిత్యం పౌష్టికాహారంతోపాటు కోడిగుడ్లు పంపిణీ చేస్తున్నారు.

**ఉమ్మడి జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల వివరాలు..**

| జిల్లా | కేంద్రాలు | గర్భిణులు | బాలింతలు | చిన్నారులు |
|---|---|---|---|---|
| మంచిర్యాల | 969 | 4,701 | 3,942 | 39,760 |
| నిర్మల్ | 926 | 5,809 | 6,405 | 61,298 |
| కుమురంభీం | 973 | 4,858 | 5,227 | 44,417 |
| ఆదిలాబాద్ | 1256 | 3,776 | 4,205 | 49,568 |



# సంపద వనాలు సిద్ధం చేయాలి

కడెం: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రాజెక్టుల వద్ద సంపద వనాలకు ఏర్పాటు చేయాలని డీఆర్డీవో విజయలక్ష్మి సూచించారు. ఆదివారం కడెం ప్రాజెక్టు కింద ఏర్పాటు చేయనున్న సంపద వనం స్థలాన్ని పరిశీలించారు. సంపద వనాల్లో పండ్ల మొక్కలు పెంచనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

# దేశానికే మోడల్‌గా నిలిచిన మిషన్ భగీరథ

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
- ఘనంగా మంచినీళ్ల పండుగ



చిన్నారికి బహుమతి ఇస్తున్న మంత్రి ఐకేరెడ్డి, కలెక్టర్

దిలావర్‌పూర్: మిషన్ భగీరథ పథకం దేశానికే మోడల్‌గా నిలిచిందని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని మాడేగాం వాటర్ గ్రిడ్ (వాటర్ ట్రీట్‌ప్లాంట్) లో ఆదివారం మంచినీళ్ల పండుగ నిర్వహించారు. మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వాటర్ ట్రీట్ ప్లాంట్, ఎస్సారెస్పీ నుంచి వచ్చే రావాటర్ ఏరియేటర్, లేబోరేటరీని పరిశీలించారు. వాటర్ గ్రిడ్ ఈఈ సందీప్, డిప్యూటీ ఈఈ అంజన్‌కుమార్ మిషన్ భగీరథ నీటిని ప్రజలకు అందిస్తున్న తీరు వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ వాటర్ ప్లాంట్లలో నాణ్యత ప్రమాణాలు ఉండవని, ప్రజలు భగీరథ నీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల ప్రజలకు రోజుకు 13కోట్ల లీటర్ల శుద్ధజలాన్ని మాడేగాం వాటర్ ట్రీట్ ప్లాంట్ ద్వారా అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, ఆర్డీవో స్రవంతి, సర్పంచ్ సరిత రాజు, ఎంపీపీ పాల్దె అక్షర అనిల్, పీఏసీఎస్ చైర్మన్ పీవీ రమణారెడ్డి, ఎఫ్‌ఎస్‌సీఎస్ డైరెక్టర్ రాంకిషన్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సుభాష్‌రావు, ఏఎంసీ చైర్మన్ చిలుక రమణ, నాయకులు అల్లోల మురళీధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, నాయకులు అనిల్, శ్రీనివాస్, భుజంగ్‌రావు, చిన్నయ్య, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 'వాత్సల్య'పై అవగాహనేది?

- ప్రయోజన పథకానికి ప్రచారం కరువు
- మార్గదర్శకాలు రాలేదన్న అధికారులు
- నిరాశకు గురవుతున్న బాలబాలికలు



వివేకానంద ఆవాసంలో ఆశ్రయం పొందుతున్న పిల్లలు

భైంసాటౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రవేశపెట్టిన మిషన్ వాత్సల్య పథకంపై అవగాహన కొరవడింది. సోషల్ మీడియాలో పథకం ప్రయోజనాల గురించి తెలుసుకున్న అర్హులు అధికారులను సంప్రదిస్తే మార్గదర్శకాలు రాలేదని చెబుతుండగా నిరాశకు గురవుతున్నారు. నెలనెలా రూ.2వేల నుంచి రూ.4వేల వరకు సాయమందించే ఈ పథకం ఎప్పటి నుంచో అమలులో ఉన్నా జిల్లా అధికారులు స్పష్టతనివ్వకపోవడం గమనార్హం. భైంసా పట్టణంలోని వివేకానంద ఆవాసంలో దాదాపు 30 మంది వరకు తల్లి లేదా తండ్రి లేని పిల్లలు, ఇద్దరూ లేని అనాథ పిల్లలు ఆశ్రయం పొందుతున్నారు. సదరు పథకంపై అవగాహన లేక వీరిలాంటి చాలా మంది పిల్లలకు లబ్ధి చేకూరడం లేదు. భైంసా పట్టణంలోని తపాలాశాఖ కార్యాలయానికి ఇటీవల ఓ బాలిక వచ్చి పథకం గురించి వాకబు చేయగా తెలియదంటూ సిబ్బంది బదులిచ్చారు. దీంతో సదరు బాలిక నిరాశగా వెనుదిరిగింది. అయితే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తంగా ప్రవేశపెట్టిన మిషన్ వాత్సల్య పథకం గురించి సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమవుతోంది. కాగా, అర్హులు పథకం గురించి ఎవరిని సంప్రదించాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు కూడా పథకం గురించి ప్రచారం చేయకపోవడంతో అర్హులకు ప్రయోజనం చేకూరడం లేదు.

### జిల్లాలో 200పైగా అనాథలు..

జిల్లాలో దాదాపు 200కుపైగా అనాథ పిల్లలుంటారని వివిధ బాలల హక్కుల స్వచ్ఛంద సంస్థల సర్వే అంచనా. ఇప్పటికే ఈ పథకం కింద జిల్లాలో పలువురు అనాథ పిల్లలు ప్రయోజనం పొందుతున్నారు. తల్లి లేదా తండ్రి లేని పిల్లలకు నెలకు రూ.2వేలు, తల్లిదండ్రులిద్దరూ లేని పిల్లలకు రూ.4వేలు అందిస్తున్నారు. గతంలోనే ఈ పథకం ఉన్నా.. చాలామందికి అవగాహన లేదు. ఇటీవల సామాజిక మాధ్యమాల్లో పథకంపై విస్తృత ప్రచారం కల్పించిన నేపథ్యంలో చాలామంది అనాథ పిల్లలు ఆశలు పెట్టుకుంటున్నారు. పథకం విషయమై సంబంధిత అధికారులను ఆశ్రయిస్తే మార్గదర్శకాలు రాలేదని సమాధానమిస్తున్నారు. దీంతో తల్లిదండ్రులు లేని అభాగ్యులు నిరాశకు గురవుతున్నారు.

### అర్హులెవరంటే...

అనారోగ్యం, కరోనా, దీర్ఘకాలిక వ్యాధులతో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు మిషన్ వాత్సల్య పథకానికి అర్హులు. వివిధ కారణాలతో తల్లిదండ్రులు విడిపోతే, తల్లి లేదా తండ్రి వద్ద ఉంటున్న పిల్లలు, తల్లి లేదా తండ్రి చనిపోయిన వీరి పిల్లలు ఈ పథకానికి అర్హులు. ఈ పథకం కింద జిల్లా బాలల సంరక్షణాధికారి కార్యాలయం నుంచి 18ఏళ్లు నిండే వరకు నెలకు రూ.4వేలు అందిస్తారు.

### మార్గదర్శకాలు రాలేదు

మిషన్ వాత్సల్య పథకంపై నూతన మార్గదర్శకాలు రావాల్సి ఉంది. పథకం గతం నుంచే అమలులో ఉంది. అనాథలైన పిల్లలకు ఈ పథకం కింద రూ.4వేలు అందిస్తోంది. అనాథ పిల్లలు, తల్లి లేదా తండ్రి లేని పిల్లలుంటే జిల్లాలోని బాలల సంరక్షణాధికారి కార్యాలయంలో సంప్రదించాలి. మార్గదర్శకాలు అందిన వెంటనే అర్హులకు పథకం ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటాం.

– దేవి మురళి, జిల్లా బాలల సంరక్షణాధికారి

# విశ్వాసం కోల్పోయారనే అవిశ్వాసం



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

ఖానాపూర్: ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్ ప్రజల్లో విశ్వాసం కోల్పోవడంతోనే తామంతా ప్రజల పక్షాన నిలబడి పార్టీలకు అతీతంగా వారిపై అవిశ్వాసం కోసం కలెక్టర్‌కు విన్నవించామని కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చిన్నం సత్యం, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు పరిమి సురేశ్, బీజేపీ పట్టణాధ్యక్షుడు నాయిని సంతోష్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఖానాపూర్‌లో అక్రమ లేఅవుట్లతో పాటు అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ చైర్మన్, వైస్ చైర్మన్ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఖానాపూర్‌లో కుంటుపడుతున్న అభివృద్ధిని చూడలేకే వరుసగా మున్సిపల్ సర్వసభ్య సమావేశాలతో పాటు వార్షిక బడ్జెట్ సమావేశాలనూ బహిష్కరించామని తెలిపారు. ఈ విషయమై ఎన్నిసార్లు హెచ్చరించినా మార్పు రాకపోవడంతోనే అవిశ్వాసానికి పూనుకున్నామని పేర్కొన్నారు. అవిశ్వాస ప్రక్రియ జరిగే సమయంలో క్యాంపులో ఉండి రాజకీయాలు చేసే అవసరం లేదని, అవిశ్వాసం నెగ్గే వరకూ ప్రతీరోజు అవినీతి, అక్రమాలపై ప్రజాసమస్యలపై అనునిత్యం పోరాటాలు చేస్తామన్నారు. నూతనంగా ఏర్పడ్డ మున్సిపాలిటీ పరిధిలో జరిగే పనుల్లో రూ.లక్షల నిధులు నీటిపాలయ్యేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఖానాపూర్‌లో అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకోవడంలో విఫలమైన అధికార యంత్రాంగంపై కూడా పోరాటాన్ని కొనసాగిస్తామని చెప్పారు. కనీసం రోడ్డు విస్తరణ పనులు పూర్తిచేయలేదన్నారు. వరుస వైఫల్యాలపై ప్రజల పక్షాన నిలబడి నిలదీస్తామన్నారు. కౌన్సిలర్లు, నాయకులు కావలి సంతోష్, జన్నారపు శంకర్, శెట్టి శ్యాం తదితరులున్నారు.

## నిర్మల్ కళాకారులకు పురస్కారాలు



పురస్కారాలు అందుకున్న కళాకారులు

నిర్మల్‌టౌన్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లోని బిర్లా ఆడిటోరియంలో శ్రీశాంతికృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో స్వర్ణనంది పురస్కార ప్రదాన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ వేదికపై నిర్మల్‌కు చెందిన స్వరూపిణి నృత్య కళానికేతన్‌కు చెందిన సంగినేని నవ్య ఆధ్వర్యంలో కళాకారులు నృత్యాలు ప్రదర్శించారు. దాసరి ఆనంది, మన్విి, చరణ్య, శాన్విక, శ్రీవాణి, మనస్వినికి స్వర్ణనంది పురస్కారం లభించింది. వీరిని పలువురు అభినందించారు.

## 'మన్‌కీ బాత్' వీక్షణ

నిర్మల్‌చైన్‌గేట్: ప్రధాని మోదీ ప్రసంగించే మన్‌కీ బాత్ 102వ ఎపిసోడ్ ఆదివారం ప్రసారం కాగా జిల్లా కేంద్రంలోని డాక్టర్స్‌లేన్స్‌లో బీజేపీ నాయకులు వీక్షించారు. బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతామూర్తి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ మల్లికార్జునరెడ్డి సమక్షంలో మోదీ ప్రసంగాన్ని విన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి కొరిపెల్లి శ్రావణ్‌రెడ్డి, నాయకులు నాంపల్లి శశిరాజ్‌వర్మ, గిల్లి విజయ్, ఆకుల కార్తీక్, కొండాజీ శ్రావణ్, మహేందర్‌నాథ్, రవి కందుల, రాజు తదితరులున్నారు.

### భైంసా పట్టణంలో..

భైంసాటౌన్: పట్టణంలోని శ్రీకన్వెన్షన్ హాల్‌లో మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు వీక్షించారు. పార్టీ పార్లమెంట్ ప్రభారీ అల్జాపూర్ శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పవార్ రామారావుపటేల్, భోస్లే మోహన్‌రావుపటేల్, నారాయణ్‌రెడ్డి, రవి పాండే, అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, పట్టణాధ్యక్షుడు మల్లేశ్వర్ తదితరులున్నారు.

## క్లుప్తంగా

### ప్రకృతి ప్రేమికుల కోసమే సఫారీ



గంగాపూర్ వాచ్‌టవర్ వద్ద ఆటవీ అధికారులు, జర్నలిస్టులు

కడెం: ప్రకృతి ప్రేమికుల కోసమే ఆటవీశాఖ సఫారీ వాహనాలు ప్రవేశపెట్టిందని కడెం ఎఫ్ఆర్వో అనిత అన్నారు. కడెంకు నూతనంగా వచ్చిన సఫారీ వాహనంలో ఆదివారం జర్నలిస్టులతో కలిసి అటవీ అందాలను తిలకించారు. గంగాపూర్ వాచ్‌టవర్, బాంబు గేట్, లక్ష్మీపూర్ పగోడ తదితర ప్రాంతాల్లో సఫారీ రైడ్ చేశారు. సఫారీ రూట్‌మ్యాప్, రేట్ల వివరాలను త్వరలో ప్రకటిస్తామని ఎఫ్ఆర్వో అన్నారు. డీఆర్వో ప్రకాశ్, ఎఫ్‌బీవోలు అలీం, శంకర్ తదితరులు ఉన్నారు.

### బైక్ దొంగ అరెస్టు



షేక్ సాదుల్ అరెస్ట్ చూపుతున్న పోలీసులు

నిర్మల్‌రూరల్: జిల్లాకేంద్రంలో బైక్ దొంగను అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని నీలాయిపేట్‌లో రెండు నెలల క్రితం గంగోని మహేశ్‌కు చెందిన బైక్ దొంగతనం జరిగింది. బాధితుడు ఫిర్యాదు చేశాడు. జిల్లా కేంద్రంలో ఆదివారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా వైఎస్సార్ కాలనీకి చెందిన షేక్ సాదుల్ దొంగిలించిన బైక్‌తో పట్టుబడ్డాడు. అరెస్టు చేసి విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. బైక్ స్వాధీనం చేసుకుని షేక్ సాదుల్‌ను జైలుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

### విధులకు ఆటంకం కలిగించారని ఫిర్యాదు

బోథ్: మండలంలోని చింతల్‌బోరిలోని హనుమాన్ ఆలయం వద్ద తన విధులకు ఆటంకం కలిగించి, కొందరు తనపై దాడికి యత్నించారని సొనాల ఎఫ్ఎస్‌వో ఊదరి ప్రవీణ్‌కుమార్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. ఏఎస్సై గంగారెడ్డి కథనం ప్రకారం.. ప్రవీణ్‌కుమార్ సొనాల నుంచి వజ్జర్ గ్రామానికి రాత్రి వెళ్తున్నాడు. రాత్రి 8.50ల ప్రాంతంలో మార్గమధ్యలో చింతల్‌బోరిలోని హనుమాన్ ఆలయం వద్ద బైక్‌పై ఇద్దరు వ్యక్తులు సమీప అటవీ ప్రాంతం నుంచి రెండు టేకు కర్రలను గ్రామానికి తీసుకెళ్తున్నారు. ఎఫ్ఎస్‌వోను చూసి టేకు కర్రలను రోడ్డు పక్కన పడేసి బైక్ నడుపుతున్న వ్యక్తి పరారయ్యాడు. మరోవ్యక్తి అక్కడే ఉన్నాడు. అతన్ని విచారించగా గ్రామానికి చెందిన కాంబ్లె రామేశ్వర్‌గా పేర్కొన్నాడు. విచారణ చే స్తుండగా దురుసుగా ప్రవర్తించాడని ఎఫ్ఎస్‌వో తెలిపాడు. కాగా ఆయనకు మద్దతుగా కాంబ్లె సత్యనారాయణ, కాంబ్లె శివ వచ్చారని, సెల్‌ఫోన్‌లో వీడియో తీస్తుండగా ఫోన్ ను లాక్కొని, వీడియో డిలీట్ చేయాలని ప్ర యత్నించారు. తనను భయపెడుతూ, విధులకు ఆటంకం కలిగించారని ఫిర్యాదుతో ఆది వారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

### విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి

కుంటాల: విద్యుత్‌షాక్‌తో ఆదివారం ఎద్దు మృతిచెందింది. నర్సాపూర్(జి) మండలం బుర్గుపెల్లి(కే) గ్రామానికి చెందిన రైతు జాదవ్ భోజరాంపటేల్ తన ఎడ్లను ఆదివారం మధ్యాహ్నం కుంటాల మండలం కల్లూర్ శివారులో మేపుతున్నాడు. ఆ సమయంలో అటువైపు ఎదురుగా ఆవుల మందరావడంతో ఎడ్లు బెదిరిపోయాయి. పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎద్దు తోక తగలడంతో మృతిచెందింది.



రోహిత్



సత్యతేజ్

### మిమ్స్ విద్యార్థుల ప్రతిభ..

మంచిర్యాలఅర్బన్: ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో మిమ్స్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పి. రోహిత్ 2690 ర్యాంకు, సత్యతేజ్ 4088 మార్కులు సాధించారని కళా శాల కరస్పాండెంట్ శ్రీనివాస్‌రాజు తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను డైరెక్టర్లు ఉపేందర్‌రెడ్డి, శ్రీధర్‌రావు, విజయ్‌కుమార్,కళాశాల ప్రిన్సిపాల్ శైలజ అభినందించారు.

# జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మెరిసిన విద్యార్థులు

- నేటి నుంచి జోసా కౌన్సెలింగ్ ప్రారంభం



సీఓఈ కళాశాల ముఖద్వారం



ఎనగందుల మౌర్య | సిలివేరు వినయ్ | ముంజం అంజన్న | సొనకాంబ్లే లక్ష్మణ సిద్దు | బత్తుల కార్తీక్ | అలకటి గణేశ్ | గట్టు శ్రీహర్ష

బెల్లంపల్లి: తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బెల్లంపల్లి బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీఓఈ) కళాశాల విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో మెరిశారు. ప్రైవేట్, కార్పొరేట్ కళాశాల విద్యార్థులకు దీటుగా జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో నెగ్గి ప్రతిభ పాటవాలను ప్రదర్శించారు. ఈసారి సీఓఈ కళాశాల నుంచి మొత్తం 18మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా వీరిలో ఏడుగురు విద్యార్థులు అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో రాణించి జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో సత్తా చాటిన విద్యార్థుల్లో ఎనగందుల మౌర్య (957 ) ప్రిపరేటరీ ర్యాంకుతో కళాశాల టాపర్‌గా నిలువగా సిలివేరు వినయ్ (2,027), ముంజం అంజన్న (2,191), సొనకాంబ్లే లక్ష్మణ్ సిద్దు (2,495), బత్తుల కార్తీక్ (3,050), అలకటి గణేష్(5,295), గట్టు శ్రీహర్ష (5,832) జాతీయ స్థాయిలో ర్యాంకులు తెచ్చుకున్నట్లు సీఓఈ కళాశాల ప్రిన్సిపాల్ ఐనాల సైదులు ప్రకటించారు. క్వాలీఫై అయిన విద్యార్థులకు సోమవారం నుంచి జరిగే జోసా కౌన్సెలింగ్‌లో ర్యాంక్‌ల ప్రాతిపదికన దేశంలోని ప్రతిష్టాత్మక ఐఐటీ కళాశాలల్లో సీట్ల కేటాయించనున్నారు. విజయం సాధించిన విద్యార్థులను బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ప్రత్యేకంగా అభినందించారు. ప్రిన్సిపాల్ సైదులు, అధ్యాపకులు చందా లక్ష్మీనారాయణ, నాగిని శ్రీరామవర్మ, సుంకరి అర్జున్, మిట్టా రమేశ్, సురేష్‌గౌడ్ ఎంతగానో కృషి చేస్తున్నారని ప్రశంసించారు.

### మెరుగైన బోధనతోనే అద్భుత ఫలితాలు



ప్రణాళికాబద్ధంగా విద్యా బోధన చేయడం, విద్యార్థులకు అన్ని అంశాలపైన సమగ్రమైన అవగాహన కలిగించడంతోనే జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ఉత్తమంగా రాణిస్తున్నారు. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా అధ్యాపకులు అంకిత భావంతో విద్యాబోధన చేస్తున్నారు. ముందస్తుగా విద్యార్థులకు పోటీ పరీక్షలపై ఉండే భయాన్ని పోగొట్టడం సునాయసంగా అద్భుతమైన ఫలితాలను సాధిస్తున్నారు.

– ఐనాల సైదులు, ప్రిన్సిపాల్, సీఓఈ కళాశాల బెల్లంపల్లి

### సత్తాచాటిన 'గిరి' విద్యార్థి



కోటపల్లి: మండలంలోని బొప్పారం గ్రామానికి చెందిన నిరుపేద గిరిజన విద్యార్థి రవికుమార్ జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఆల్ ఇండియాలో 16711 ర్యాంక్, రాష్ట్రంలో 164వ ర్యాంక్ సాధించాడు. రవికుమార్ 1 నుంచి 4వ తరగతి వరకు బొప్పారం గ్రామంలో చదివాడు. బీమారం ఎస్టీ హాస్టల్‌లో పదో తరగతి పాసై ఇంటర్ హైదరాబాద్‌లో గిరిజన సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో విద్యనభ్యసించి జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు ఎంపిక కావడం సంతోషంగా ఉందని తెలిపారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మెరిసిన రవికుమమార్‌ను సర్పంచ్ జెల్ల సతీశ్, ఆదివాసీ కులసంఘాల నాయకులు బండి రమేశ్, జేక శేఖర్, నగేశ్ అభినందించారు.

–మానెపల్లి రవికుమార్

### నిర్మల్ విద్యార్థి ప్రతిభ

- జాతీయ స్థాయిలో 708, ఎస్టీ కేటగిరీలో ఐదో ర్యాంకు కైవసం



చంద్రసేన్ నాయక్‌కు మిఠాయిలు తినిపిస్తున్న తల్లిదండ్రులు

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రంలోని దివ్యనగర్‌కు చెందిన కున్సోత్ చంద్రసేన్ నాయక్ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జాతీయస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. జిల్లా కేంద్రంలోని దివ్యనగర్‌కు చెందిన కున్సోత్ సుదర్శన్, పద్మ దంపతుల కుమారుడు చంద్రసేన్ నాయక్ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో ఓపెన్ కేటగిరీలో 708 ర్యాంకు, ఎస్టీ కేటగిరీలో జాతీయ స్థాయిలో 5వ ర్యాంకును కైవసం చేసుకున్నాడు. తెలంగాణ ఎంసెట్‌లో రాష్ట్రస్థాయి 465, ఏపీ ఎంసెట్‌లో 263 ర్యాంకులు సాధించాడు. తండ్రి సుధార్‌సింగ్ లోకేశ్వరంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తుండగా తల్లి పద్మ నిర్మల్ మండలంలోని వెంకటాపూర్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తోంది. చంద్రసేన్‌నాయక్ 1 నుంచి 5వ తరగతి వరకు స్థానిక సెయింట్ థామస్ పాఠశాలలో అభ్యసించగా, ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు హైదరాబాద్‌లోని శ్రీచైతన్య విద్యాసంస్థలో చదువుకున్నాడు.

### ఉత్తమ ప్రతిభ



దూస చేతన్

లక్ష్మణచాంద: దేశంలోని ఐఐటీ కళాశాలల్లో అడ్మిషన్స్ కోసం నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో ఓబీసీ విభాగంలో మండల కేంద్రానికి చెందిన దూస చేతన్ ఆల్ ఇండియా 1319 ర్యాంక్ సాధించారు. ఆయన తల్లిదండ్రులు లక్ష్మీనారాయణ– రాజమని ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులే కావడం గమనార్హం. ఉత్తమ ర్యాంక్ సాధించిన చేతన్‌ను పలువురు అభినందించారు.

### బావపై యాసిడ్ దాడి

- ఇంట్లో గొడవలకు కారణం అవుతున్నాడని మరదలు దాడి



గాయపడ్డ మోహన్(ఫైల్)

ముధోల్: బావపై యాసిడ్‌తో మరదలు దాడి చేసిన ఘటన మండలంలోని తరోడా గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గడ్‌పాలే మోహన్ ఈ నెల 13న తన ఇంటి బంగ్లాపై నిద్రిస్తున్న సమయంలో అతనిపై యాసిడ్ దాడి జరిగింది. అతను కేకలు వేయడంతో స్థానికులు, కుటుంబీకులు భైంసా ఏరియాసుపత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ అనంతరం ఎస్సై సాయికిరణ్ ఆదివారం వివరాలు వెల్లడించారు. బాధితుడి మరదలు కల్పనే నిందితురాలని పేర్కొన్నారు. కుటుంబ కలహాలకు, తరచూ ఇంట్లో గొడవలు కావడానికి మోహన్ కారణంగా ఉంటున్నాడని కల్పన యాసిడ్ దాడికి పాల్పడినట్లు వెల్లడించారు. ఆమెను అరెస్టు చేసినట్లు తెలిపారు.

### దాడి చేసిన పలువురిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: రాళ్లతో ముగ్గురిపై దాడికి పాల్పడిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్సై ఊశన్న తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణంలో లారీ డ్రైవర్ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించి ఆదివారం సమావేశం జరిగింది. బోథ్‌కు చెందిన ముజీబ్ అహ్మద్‌తోపాటు మరో ఐదారుగురు హాజరయ్యారు. మధ్యాహ్న భోజనం చేసేందుకు ఖుర్షీద్‌నగర్ వైపు వెళ్లారు. వీరు వెళ్తున్న వాహనాన్ని పట్టణానికి చెందిన లారీ అసోసియేషన్ నాయకులు షౌకత్, సిరాజ్, సద్దాం, రషీద్, అబ్బాస్, తన్ను, అంజద్ అడ్డుకున్నారు. ఆదిలాబాద్‌లో జరిగే ఎన్నికలకు మీరెందుకు వచ్చారని దుర్భాషలాడారు. అనంతరం రాళ్లతో కారును ధ్వంసం చేశారు. కారులో ఉన్న ఇస్మాయిల్, నజీర్, ముస్తఫాపై రాళ్లతో దాడి చేయడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

### ఒకరి అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కైలాస్‌నగర్‌కు చెందిన అశోక్ (56) అదృశ్యమయ్యారు. ఎస్సై ఇసాక్ కథనం ప్రకారం.. అశోక్ శనివారం కుటుంబీకులతో గొడవపడ్డాడు. కోపంతో ఇంటి నుంచి వెళ్లి రాత్రివరకు తిరిగిరాలేదు. కుమారుడు నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# ఆధార్ సమాచారం భద్రం

- దుర్వినియోగం కాకుండా రిజిస్ట్రేషన్ల శాఖలో చర్యలు



ఆధార్‌కార్డులో చివరి నాలుగు అంకెలు కనిపించేలా దిద్దిన దృశ్యం

నేరడిగొండ: వినియోగదారుల సమాచారం ఆధార్ చాలా సంస్థలు, కంపెనీల్లో దుర్వినియో గం కావటం, తస్కరించి అమ్మకానికి పెట్టడం వంటి ఘటనలు వెలుగుచూశాయి. ఈ నేపథ్యంలో ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం విక్రయ, కొనుగోలుదారులు, సాక్షులు సమర్పించే ఆధార్ వివరాలను గోప్యంగా ఉంచడానికి రాష్ట్ర స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ చర్యలు చేపట్టింది. దీనిపై రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఇటీవల ఉత్తర్వులు రాగా, ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ఖానాపూర్, భైంసా, మంచిర్యాల, లక్సెట్టిపేట, ఆసిఫాబాద్‌లోని కార్యాలయాల్లో అమలు చేస్తున్నారు. దస్తావేజుల్లో విక్రయదారులు, కొనుగోలుదారులు, సాక్షుల ఆధార్ కార్డు నంబర్‌లోని తొలి ఎనిమిది అంకెలు కనిపించకుండా, చివరి నాలుగు అంకెలే కనిపించేలా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చిన స్థిర, చరాస్తుల క్రయ, విక్రయదారులు తమ ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు జత చేస్తారు. రిజిస్ట్రేషన్ చేసే ముందు వాటిని సబ్ రిజిస్ట్రార్ పరిశీలిస్తారు. ఆధార్ వివరాలు సరిగ్గా ఉన్నాయని నిర్ధారించుకున్నాక జిరాక్స్ ప్రతిపై మొదటి ఎనిమిది అంకెలు ఎవరికి కనిపించకుండా మార్కర్‌తో దిద్దుతున్నారు. ఆ తర్వాత దస్తావేజులు, ఆధార్ కార్డులను స్కానింగ్ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. రాష్ట్రంలో ధరణి ప్రారంభమయ్యాక వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు తహసీల్దార్ కార్యాలయాల్లోనే చేస్తున్నారు. ఆధార్ గోప్యత విషయంలో తహసీల్దార్లకు మాత్రం ఎలాంటి ఉత్తర్వులు రాలేదు.

### వినియోగదారుల భద్రత కోసమే..

వినియోగదారుల సమాచారాన్ని భద్రంగా ఉంచడానికి మా శాఖ జాగ్రత్తలు తీసుకుంటుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే ఇలా నిర్వహిస్తున్నాం .ఆధార్ గోప్యత ఉండేలా చూస్తున్నాం.

– శ్రీరామరాజు, సబ్‌రిజిస్ట్రార్, బోథ్

# ఉద్యోగం ఒకరిది.. విధుల్లో మరొకరు

- ఇదీ రెగ్యులర్ నాలుగో తరగతి ఉద్యోగి నిర్వాకం
- వేరే వ్యక్తిని నియమించుకున్న వైనం
- ఆశ్రమ పాఠశాలలో దుస్థితి
- చోద్యం చూస్తున్న అధికారులు



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఉద్యోగి (ఫైల్)

ఆదిలాబాద్‌రూరల్: ఆయనో రెగ్యులర్ నాలుగో తరగతి ఉద్యోగి. ప్రభుత్వం నెలకు వేలాది రూపాయల వేతనం ఇస్తోంది. ఆయన ఏదో సాకుతో విధులు నిర్వర్తించకున్నా వేతనం పొందుతున్నాడు. వేరే వ్యక్తిని నియమించుకుని కూర్చున్నా చోట జీతం తీసుకుంటున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఈ విషయం సంబంధిత అధికారుల దృష్టికి వచ్చినా చోద్యం చూస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదంతా ఆదిలాబాద్ డివిజన్ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలోని నాలుగో తరగతి ఉద్యోగుల వ్యవహారం. సదరు ఉద్యోగి తాత్కాలికంగా నియమించిన వేరే వ్యక్తి వల్ల ఏదైనా సంఘటన జరిగితే బాధ్యులెవరని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత పాఠశాల హెచ్‌ఎం సైతం చూసీచూడనట్టు వ్యవహరించడంపై విమర్శలున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘాల నాయకులు, విద్యార్థి సంఘాల నేతలు కోరుతున్నారు.

**డివిజన్‌లో 14 ఆశ్రమ పాఠశాలలు**

ఆదిలాబాద్ డివిజన్ పరిధిలో మొత్తం 14 ఆశ్రమ పాఠశాలలు ఉండగా, ఇందులో 6 బాలికల పాఠశాలలు ఉండగా, ఇందులో 1,288 మంది బాలికలు, 8 బాలుర వసతి గృహాలు ఉండగా 1,662 మంది బాలురు ఉన్నారు. ఆయా పాఠశాలలో 42 మంది రెగ్యులర్ నాలుగో తరగతి ఉద్యోగులు, 56 మంది పార్ట్ టైం, 29 డెలివైజెస్, 18 మంది శానిటేషన్ వర్కర్లు ఉన్నారు. నాలుగో తరగతి రెగ్యులర్ ఉద్యోగైతే వారి సీనియారిటీని బట్టి రూ.35 వేల నుంచి రూ.80 వేల వరకు నెలకు వేతనం ఉంది. పార్ట్ టైం ఉద్యోగికి రూ.10 వేలలోపే ఉంది. ఇదిలా ఉండగా రెగ్యులర్ నాలుగో తరగతి ఉద్యోగి ఆయన విధులు నిర్వర్తించకుండా తాత్కాలికంగా నియమించిన వేరే వ్యక్తికి నెలకు ఎంతో కొంత వేతనం అందజేస్తున్నారు.

### చర్యలు తీసుకుంటాం



ఆశ్రమ పాఠశాలలో ఉద్యోగులు కాకుండా ఇతరులను నియమించుకుని పని చేయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చింది. అలా చేస్తే చర్యలు తీసుకుంటాం. – నిహారిక, ఏటీడీవో, ఆదిలాబాద్

### ఇంద్రాదేవి ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయంలో విత్తన, వర్షం కోసం పూజలను ఆదివాసీలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఆదివాసీలు తరలివచ్చి ఆదివారం ఆలయంలో పూజలు చేశారు. మహిళలు నవధాన్యాలతో నైవేద్యాలు తయారు చేసి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఇంద్రాదేవి ఆలయ మహారాజ్ కహాకటి సూర్యరావ్, గ్రామాల ఆదివాసీ పెద్దలు ఉన్నారు.

### పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య

బోథ్: పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై గంగారెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని పొచ్చర గ్రామానికి చెందిన యాల్ల భీంరెడ్డి(55) గత కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. కాగా శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు బోథ్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి, అటు నుంచి ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

# అపూర్వం.. ఆత్మీయం



పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

- 30 ఏళ్ల తర్వాత కలిసిన వడ్యాల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1993–94 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు 30 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. కనకాపూర్‌లోని కేఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎక్కడెక్కడో స్థిరపడిన వారందరు ఇక్కడకు వచ్చారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమెరువేసుకున్నారు. రోజంతా సంతోషంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు పాదాభివందనం చేశారు. విశ్రాంత ఎంఈవో రమణయ్య స్వామి, విశ్రాంత ఉపాధ్యాయులు లక్ష్మణ్, రఘోత్తమ్ రెడ్డి, నిర్మల, మోహన్‌రావు, గంగన్న, వినోద, నారాయణవర్మ పూర్వ విద్యార్థులు బి.సాయన్న, హంసలత, జె.శ్రీనివాస్, పి.సాయన్న, రవీందర్, నాగరాజు, రాజేందర్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.


### సంతోషంగా ఉంది



విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆత్మీయ సమ్మేళనానికి ఆహ్వానించి సన్మానించడం సంతోషంగా ఉంది. ఎంత ఎత్తుకు ఎదిగిన విద్య నేర్పిన గురువులను మరిచిపోకుండా ఉండటం గర్వంగా ఉంది.

– బి.రమణయ్య స్వామి, విశ్రాంత ఎంఈవో


### సెలవులపై వచ్చా..



పంజాబ్ నుంచి ఇక్కడకు వచ్చాను. ఆర్మీలో సుబేదారిగా పనిచేస్తున్నాను. ఆత్మీయ సమ్మేళనానికి మిత్రులు రావాలని కొన్నిరోజుల ముందే చెప్పారు. సెలవులపై వచ్చి మిత్రులను కలిశాను. చాలా సంతోషంగా ఉంది.

– వంగ రాజు, ఆర్మీ అధికారి

### దుబాయ్ నుంచి వచ్చా..



30 ఏళ్ల తర్వాత మిత్రులను కలవబోతున్నామని తెలవడంతో దుబాయ్ నుంచి రెండు రోజుల క్రితం వచ్చాను. మిత్రులు, గురువులను కలవడంతో సంతోషంగా ఉంది.

– రాజేందర్, పూర్వ విద్యార్థి

### కాపర్‌వైర్ చోరీ కేసులో ఒకరి అరెస్టు

- పరారీలో ఇద్దరు • వివరాలు వెల్లడించిన డీఎస్పీ జీవన్‌రెడ్డి



స్వాధీనం చేసుకున్న కాపర్ వైర్‌తో పోలీసులు

సోన్: జల్సాలకు అలవాటుపడి ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్‌వైర్ చోరీ కేసులో మహారాష్ట్రకు చెందిన ఏ3 నిందితుడు ఫక్రు గోరే (32)ను ఆదివారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. పరారీలో ఇద్దరు ఉన్నారని పేర్కొన్నారు. డీఎస్పీ వెల్లడించిన వివరాల ప్రకారం.. పెరోల్‌పై వచ్చిన ఏ1 ర్యాపని ఎల్లయ్య(47), ఏ2 దండేల్‌వార్ బాబురావ్ (40), ఏ3 ఫక్రు గోరే స్నేహితులు. గత కొంత కాలంగా మామడ, సోన్, లక్ష్మణచాంద, నిర్మల్, కడెం పరిధిలో టాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి కాపర్‌వైర్‌ను దొంగతనం చేస్తుండేవారు. రైతులకు, విద్యుత్ శాఖకు తీరని నష్టం కలిగిస్తున్నారని ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు బృందాలుగా ఏర్పడ్డారు. వారి కోసం గాలిస్తుండగా మామడ మండలం సాంగ్వి ఎక్స్‌రోడ్డు వద్ద కారులో చోరీ చేసిన కాపర్ వైర్‌ను కరీంనగర్‌లో అమ్మేందుకు వెళ్తుండగా ఏ3 నిందితుడు ఫక్రు గోరేను అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. స్వాధీనం చేసుకున్న కాపర్ వైర్ విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని పేర్కొన్నారు. నిందితుడిని పట్టుకున్న పోలీసులను డీఎస్పీ అభినందించారు. సీఐ నవీన్‌కుమార్, ఎస్సైలు సంతోషం రవీందర్, రాహుల్ గైక్వాడ్, అశోక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

భైంసారూరల్: రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతిచెందాడు. ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం.. భైంసాలోని పిప్రికాలనీకి చెందిన సూర్యవంశీ ఆకాశ్(27) మాంజ్రీ సమీపంలోని ఆస్పత్రిలో పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి బైక్‌పై విధులకు వెళ్తున్నాడు. భైంసా–నాందేడ్ ప్రధాన రహదారి మాంజ్రీ గ్రామ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతిచెందాడు. ఆదివారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి తండ్రి సాయినాథ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.